ఆలయ ప్రతిబింబం అద్భుతం

యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయం స్వర్ణవర్ణంతో ప్రతిబింబిస్తూ మహాద్భుతంగా దర్శనమిచ్చింది. బుధవారం కురిసిన వర్షానికి తిరు మాఢవీధుల్లో నిలిచిన వర్షపు నీటితో ప్రధానాలయ ప్రతిబింభం అద్భుతంగా కనిపిస్తూ భక్తులకు కనువిందు చేసింది. - గుజ్జ నరేశ్, నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా



పవళింపు సేవలో పాల్గొన్న కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

సజావుగా ముగిసిన మేళ్లచెర్వు జాతర

- హుండీ ద్వారా రూ.10,48 లక్షలు, ఆర్జిత సేవల ద్వారా రూ.28.41లక్షలు
- గతేడాదితో పోల్చితే రూ.1.17 లక్షలు తగ్గిన ఆదాయం
- ఉత్సాహంగా సాగిన ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 13 : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదు రోజులుగా వైభవంగా కొనసాగిన స్థానిక స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయ జాతర మంగళవారం అర్ధరాత్రి స్వామివారి పవళింపు సేవతో ముగిసింది. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక ఊయల పైకి చేర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు రాధాకృష్ణమూర్తి, శివవిష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. . కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఐదు రోజులూ జన జాతరగా కొనసాగిన వేడుకల్లో ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతం నుంచి తలపడ్డ ఈ పోటీలను వీక్షించడానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఎద్దుల పందేల్లో హైదరాబాద్ హాస్యచౌదరి ఎద్దులు ప్రథమ, నంద్యాల-డోన్‌కు చెందిన సుబ్బారెడ్డి ఎద్దులు ద్వితీయ, కృష్ణా జిల్లా పెనుమలూరుకు చెందిన దేవబత్తుని సుబ్బారావు ఎద్దులు తృతీయ బహుమతిని గెలుచుకున్నాయి. మరోవైపు పురుషుల కబడ్డీ పోటీల్లో వైజాగ్ జట్టు ప్రథమ, విజయనగరం జట్టు ద్వితీయ, హైదరాబాద్ సాయిస్పోర్ట్స్ అథారిటీ జట్టు తృతీయ, ప్రకాశం జట్టు చతుర్థ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి బహుమతులు అందించారు. బుధవారం దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో జాతరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయానికి మొత్తం రూ.38,89,889 ఆదాయం సమకూరింది. గతేడాదితో పోలిస్తే రూ.1.17 లక్షలు తగ్గింది. హుండీ ద్వారా రూ. 10,48,012 ఆదాయం రాగా గతేడాదితో పోలిస్తే రూ.42,171 ఎక్కువగా వచ్చింది. వాటితో పాటు పలు ఆర్జిత సేవల ద్వారా రూ.28,41,877 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, సభ్యులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానం : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ, మార్చి 13 : రక్తదానం చేయడం మన కనీస కర్తవ్యమని దాని వల్ల ఒకరి ప్రాణం కాపాడిన వారమవుతామని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని 25వ వార్డు నందు తలసేమియా, డయాలసిస్ రోగుల సహాయార్థం బీఆర్ఎస్ యువ జన విభాగ నాయకుడు వేముల కోటేశ్వర్ రావు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చన్నారు. నేటి యువత సమాజం పట్ల సేవాభావంతో ఉండడం మంచి విషయమన్నారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌చార్జి చింతల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు అల్వాల వెంకటేశ్వర్లు, చింతల లింగయ్య, కోదాటి కృష్ణయ్య, యువజన విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడికి పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అర్వపల్లి, మార్చి 13 : నేడు మండల పరిధిలోని తుంగగూడెం, కాసర్లపహాడ్, అడివెంల, తిమ్మాపురం, కుంచమర్తి గ్రామాల్లో ఫీడర్ లైన్స్‌కు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించేందుకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

నూతనకల్, మార్చి 13 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని చదువుకోవాలని అక్షర ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల ఉపేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లసింగారంలో గల కేజీబీవీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెన్నులు, ప్యాడ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ మాధవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్ అందజేత

గరిడేపల్లి, మార్చి 13 : మండలంలోని పానుగోడు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం-4కు స్థానిక ఎంపీటీసీ-2 మేళ్ల చెర్వు వెంకటరమణ బుధవారం ఫ్యాన్‌ను బహూకరించారు. విద్యార్థుల ఇబ్బందులు తొలగించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ పిడమర్తి అంజి, అనంతు తరుణ్, తిప్పని సాయి పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నేరేడుచర్ల, మార్చి 13 : నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బుధవారం పొలాల్లో అనుమానాస్పదంగా ఆరూరి శ్రీను (35) అనే వ్యక్తి మృతి చెందిపడి ఉన్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. శ్రీనుకు తొమ్మిదేండ్ల క్రితం భవాని అనే మహిళతో వివాహమైంది. కొంతకాలం హైదరాబాద్‌లో నివసించారు. ఇరువురి మధ్య విభేదాలు రాగా ఆరు నెలల క్రితం విడాకులు తీసుకున్నారు. శ్రీను తిరిగి ఇటీవల నేరేడుచర్లకు వచ్చి జాన్‌పహాడ్ రోడ్డులో టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్ల వారుజామున పీహెచ్‌సీ సమీపంలో శవమై కనిపించినట్లు తెలిపారు. శ్రీను పెదనాన్న కుమారుడు ఆరూరి నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ అంతమే మాదిగల పంతం

- హుజూర్‌నగర్ నియోజకవర్గ మాదిగ జేఏసీ అధ్యక్షుడు రాం సైదులు

గరిడేపల్లి, మార్చి 13 : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపడతామని చెబుతూ వస్తూ ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన బీజేపీ అంతమే మాదిగల పంతం కావాలని హుజూర్‌నగర్ నియోజకవర్గ మాదిగ జేఏసీ అధ్యక్షుడు రాం సైదులు అన్నారు. ఈ నెల 16న జిల్లా కేంద్రంలో తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి ఆధ్వర్యంలో జరిగే మాదిగల సమ్మేళనానికి అధిక సంఖ్యలో మాదిగలు హాజరు కావాలని కోరుతూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో సంఘం యూత్ అధ్యక్షుడు పిడమర్తి అంజి, నాయకులు కడప ఇసాక్, పిట్ట నర్సయ్య, యామరపు నాగయ్య, నాగరాజు, మధు, వినోద్ పాల్గొన్నారు.

20 నుంచి చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

సూర్యాపేట రూరల్, మార్చి 13 : పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో ఈ నెల 20 నుంచి 25 వరకు జరిగే చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ గూకంటి రాజాబాబురెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించి అనంతరం రథశాలకు ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. రథశాల ప్రహరీ నిర్మాణానికి రూ.3.40 లక్షల వ్యయంతో నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కందగట్ల రాంబాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి

కోదాడ రూరల్, మార్చి 13 : వేసవిలో ప్రజల మంచినీటి ఇబ్బందులు తెలుసుకుని చౌడం శ్రీరామ్ ఫౌండేషన్ (ఎస్.ఎస్.ఎన్) మండల పరిధి దొరకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులకు ఉచితంగా మంచినీటిని అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. శుక్రవారం మంచినీటి ట్యాంకర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతరావు, సామినేని ప్రమీల, అమరనాయిని వెంకటేశ్వర్‌రావు, తొండపు సతీశ్, గద్దల వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, ఖలీల్, గురువయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణానాయక్

గరిడేపల్లి, మార్చి 13 : రైతులను నట్టేట ముంచిన ఘనత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యంకు సరైన ధర లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇదే సమయంలో క్వింటాకు ధర రూ.3,200 వరకు ఉన్నట్లు తెలిపారు. ఇప్పుడు ధాన్యం అమ్ముకోవాలంటేనే అష్టకష్టాలు పడాల్సి వస్తుందన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో మిల్లులు అధికంగా ఉన్నప్పటికీ మిల్లర్లంతా ఏకమై మంచి ధర పెట్టకుండా రైతులను మోసం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. ఒక్క రోజులోనే రూ.200-300 వరకు రేటును తగ్గించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ ప్రాంతం నుంచి గెలిచిన వాడే కాబట్టి ఇక్కడి రైతులు పడే బాధలు తెలుసుకుని చొరవ చూపి మిల్లర్లు మంచి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, అప్పన్నపేట ఎంపీటీసీ కడప ఇసాక్, నాయకులు మేకల శోభన్‌బాబు, మాజీ సర్పంచ్ గాలి రామకృష్ణ, నట్టె సైదయ్య, సైదానాయక్, ప్రధాని సైదులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- డిప్యూటీ సీఎం భట్టికి ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 13 : పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7,200 కోట్ల బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన డిప్యూటీ సీఎంకు ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ.. మూడేండ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాస్మోటిక్ చార్జీల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోతు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్ కోటాచలం

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కోటాచలం

తుంగతుర్తి, మార్చి 13 : ప్రైవేట్ దవాఖానాల్లో ఆర్ఎంపీలు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా వైద్యాధికారి కోటాచలం హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో విలేకరులతో మాటాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే మాత్రమే ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆర్ఎంపీలు విధులు నిర్వర్తించాలని ఇష్టం ఉన్నట్లు లింగ నిర్ధారణ పరీక్షలు, వివిధ యాంటీబయాటిక్స్ బైటిక్స్ వాడితే కఠిన చర్యలు తప్పవన్నారు. మండలంలోని మంచితండాకు చెందిన ఆర్ఎంపీ కృష్ణానాయక్ యాంటీబయాటిక్స్ వాడుతున్నట్లు తెలిసిన సమాచారం మేరకు రైడ్ చేయగా మందులు దొరికడంతో అతడిపై తదుపరి చర్యల కోసం తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ చింతమల్ల నిర్మల్‌కుమార్, డాక్టర్ రామకృష్ణ, జిల్లా అధికారి ఆనంద్ పాల్గొన్నారు.

పానుగోడులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

గరిడేపల్లి : పానుగోడు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి, మార్చి 13 : మండలంలోని పానుగోడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కటకం జోగయ్య ఫౌండేషన్ చైర్మన్ కటకం వేణు, గడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వర్‌రావు, నాయకులు అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, యేడిపాల సత్యనారాయణరెడ్డి, నక్క మట్టయ్య, కోడి మల్లయ్య, ఆవుల నాగయ్య, పి.సైదులు, చామకూరి గురుస్వామి, అందె వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి

- సీపీఐ మండల కార్యదర్శి పాపిరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

మేళ్లచెర్వు, మార్చి 13 : ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.20 వేల నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి సారెడ్డి పాపిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉప్పుతల కోటమ్మ, ఎలమంద పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 13 : లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల టీమ్‌లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బీఎస్.లతతో కలిసి అన్ని శాఖల సిబ్బందికి మోడల్ కోడ్, సీ-విజిల్, సువిధ, మ్యాన్ పవర్ మెనేజ్‌మెంట్, మీడియా సెంటర్, ఈవీఎం మేనేజ్‌మెంట్ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు అన్ని శాఖల సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, టాయిలెట్స్, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్, ఏజెంట్ చేసే పనులు, పోలింగ్ సరళి, వెబ్ క్యాస్ట్ విధానం చేయాల్సి ఉంటుందని అందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఫామ్-12డి ద్వారా 85 సంవత్సరాల ఉన్న వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ట్రైనింగ్ అధికారులు విప్పర్లు, రమేశ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

లింగయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్ పరామర్శ

మద్దిరాల, మార్చి 13 : మండలంలోని చిననేమిల గ్రామానికి చెందిన రావుల లింగయ్య రాత్రి సమయంలో పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లి పాముకాటుతో ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ లింగయ్య కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎస్ఏ రజాక్, నాయకులు కన్న వీరన్న, రావుల వెంకన్న, శిరంశెట్టి వెంకన్న, సుంచు అవిలయ్య, లావుడ్య వెంకన్న, సూరినేని తిరుమల్‌రావు, మల్లయ్య, సోమేశ్వర్‌రావు, సైదులు, రాములు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

నేరేడుచర్లలో మొల్లమాంబ జయంతిని నిర్వహిస్తున్న శాలివాహన సంఘం నాయకులు

నేరేడుచర్ల, మార్చి 13 : తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణంను రాసిన తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని బుధవారం మండల కేంద్రంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్, సుధాకర్, మహేశ్, శ్రీను, రామకృష్ణ, సత్యనారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.

ఆప్ జిల్లా అధికార ప్రతినిధిగా మురళీధర్‌రెడ్డి

బొడ్రాయిబజార్, మార్చి 13 : ఆమ్ ఆద్మీ పార్టీ సూర్యాపేట జిల్లా అధికార ప్రతినిధిగా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరికి చెందిన దుంపల మురళీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మేరకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కెళ్లపల్లి శ్యామ్‌సుందర్, ప్రధాన కార్యదర్శి మెరుగు విక్రమేంద్ కుమార్, కోశాధికారి గ్యార అంజయ్య, యూత్ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి ప్రశాంత్, జాయింట్ సెక్రటరీ సుంచు నర్సింహ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో జీవితంలో ఉన్నత శిఖరాలకు

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు

కోదాడ టౌన్, మార్చి 13 : క్రీడాస్ఫూర్తితో జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నామా నరసింహారావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్సార్ ఫ్రైమ్ స్కూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ కోచ్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో ఇండియా రేసింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీలు క్రీడాకారుల ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయని, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించడానికి దోహద పడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మునీరు, జోనల్ ఇన్‌చార్జి రణధీర్, ఏఓ రఫి, సతీశ్, సైదులు, ప్రేమ్, స్వరూప, లక్ష్మణ్, కుమారి, సైదాబీ పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందక రైతుల కష్టాలు

డీబీఎం కాల్వలో కంప చెట్లను తొలగిస్తున్న రైతులు

నూతనకల్, మార్చి 13 : మండలంలో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములకు నీళ్లు అందక చేతికి అందివస్తున్న పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో మండల పరిధిలోని ఎస్సారెస్పీ కింద 73, 74 డీబీఎం కాల్వల్లో చెట్లు పెరిగి, రాళ్లు అడ్డపడి సామార్థ్యానికి సరిపడా నీళ్లు రాకపోవడంతో ఆయకట్టు చివరి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పొట్ట దశకు వచ్చిన పొలాలు ఎండిపోతున్నాయని ఉన్న పొలాలను కాపాడుకునే ప్రయత్నంలో బుధవారం మండలంలోని మాచనపల్లి, చిల్పకుంట్ల, నూతనకల్, ఎర్రపహాడ్, దిర్శనపల్లి, పెదనెమిల గ్రామాల్లోని రైతులు స్వయంగా 73, 74 డీబీఎం కాల్వల్లోని కంప చెట్లు, ముళ్ల పోదలు, రాళ్లను తొలగించారు. ఇకనైనా అధికారులు స్పందించి నీటిని విడుదల చేయాలని మండల రైతులు కోరారు.

చివరి ఆయకట్టుకు నీరు చేరేదెలా ?

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌కు వారబంది పద్ధతిలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు ఇవ్వాలని నిశ్చయించుకున్నది. సీజన్ ఆరంభం నుంచి అడపాదడపా నీళ్లు ఇచ్చినా మద్దిరాల మండలానికి ఫిబ్రవరి చివరి వారం వరకు కొంతమేర వచ్చాయి. రెండు వారాలుగా నీళ్లు రాక పొట్ట దశలో ఉన్న వరి పంటలు ఎండుతుండడంతో నీళ్లు ఇవ్వాలని రైతులు మొరపెట్టుకోగా ఆకరి దశగా నీళ్లు వదిలారు. ఈ నీళ్లు నిన్న మద్దిరాల మండల కేంద్రానికి కొద్దిగా చేరాయి. మూడు గ్రామాల వరకే ఈ విధంగా వస్తే మండలంలో మిగిలిన 12 గ్రామాల ఆయకట్టుకు ఏ విధంగా చేరుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మఠంపల్లి, మార్చి 13 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల, ఎగువ ప్రాంతాల నుంచి నీరు నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌లోకి రాకపోవడంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాలలో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. జిల్లాలో అనేక మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి ఆదుకోవాలన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య పాండూనాయక్, సీపీఎం మండల కార్యదర్శి మాలోతు బాలూనాయక్, రైతు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు